క్లుప్తంగా

కలెక్టర్‌కు చైర్మన్ గఫార్ వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: పట్టణంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ వినతిపత్రం అందచేశారు. తగినంత నీటి వసతి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఏఎస్‌సీ గ్రాంట్ ద్వారా పట్టణంలో నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారని, ప్రస్తుతం ఆ గ్రాంట్ లేకపోవడంతో జనరల్ ఫండ్ ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. దీంతో నిధులన్నీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు వినియోగిస్తుండటంతో వార్డుల్లో అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎస్‌సీ గ్రాంట్‌ను కనిగిరి మున్సిపాలిటీకి మంజూరు చేసి నీటి సమస్యను పరిష్కరించి, పట్టణాభివృద్ధికి సహకారం అందించాలని ఆ వినతిపత్రంలో మున్సిపల్ చైర్మన్ గఫార్ కలెక్టర్‌ను కోరారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: మండల పరిధిలోని పెద్దగొల్లపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బయారుడు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తొలుత సిబ్బంది హాజరు రికార్డులు, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల రికార్డులు, సర్వే వివరాలు పరిశీలించారు. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు.

ప్రయాణికులను పరిమిత సంఖ్యలో ఎక్కించాలి



పొన్నలూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: ఆటో డ్రైవర్లు నిబంధనలు మేరకు పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించాలని ఎస్సై అనూక్ అన్నారు. పొన్నలూరులో బుధవారం రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి లైసెన్స్, హెల్మెట్ లేని వారికి ఈ–చలానా ద్వారా జరిమాన విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపరాదని, ఒకవేళ ఎవరైనా బైక్‌లు, వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారితో పాటు తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. బైక్ నడిపేటప్పుడూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు విలువైన ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్డినెన్స్ ద్వారా మాలలకు అన్యాయం

టంగుటూరు: ఆర్డినెన్స్ ద్వారా మాలలకు అన్యాయం చేస్తే ఊరుకోమని రాష్ట్ర మాల ఉద్యోగం సంఘ అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ బాబు అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని, రిజర్వేషన్ వర్గీకరణ ద్వారా మాల మాదిగల్లో మధ్య చిచ్చుపెట్టి ప్రభుత్వాలు తమాషా చేయటం దుర్మార్గమని తెలిపారు. మాలల భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దొడ్డిదారి ఆర్డినెన్స్‌ను మాలలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, మాలల జేఏసీ నాయకులు ఏడుకొండలు, శాంతారావు, పాలేటి కోటేశ్వరరావు, దేవరపల్లి చంద్రబాబు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కనిగిరిరూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక మున్సిపల్ ఆఫీసు వద్ద ధర్నా చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను ఆప్కాస్‌లో కొనసాగించాలని, సమ్మె కాలానికి 16 రోజుల వేతనాన్ని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు జి. ఓబయ్య, చార్లెస్, బాలస్వామి, ఎలీషా, మార్క్, సీహెచ్ రవి, సుబ్రహ్మణ్యం, రోజమ్మ, గురవమ్మ, నరేంద్ర, బషీరా పాల్గొన్నారు.

నేను చెప్పినట్లే చేయాలి..!

- విప్పగుంటలో 104 ఆరోగ్య సిబ్బందికి టీడీపీ నాయకుడు హుకుం
- తన బ్యారన్ కొష్టం దగ్గర వైద్యసేవలు అందించాలని హితవు
- గ్రామస్తులకు వైద్య సేవలు అందక అగచాట్లు



టీడీపీ నాయకుడి బ్యారన్ కొష్టం దగ్గర ఏర్పాటు చేసిన 104 వైద్య శిబిరం

పొన్నలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో టీడీపీ నాయకుల ఆగడాలు తారా స్థాయికి చేరుతున్నాయి. తాము చెప్పిందే వేదమంటూ అన్ని విషయాల్లో తలదూర్చుతూ కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారులను బెదిరిస్తూ మేము చెప్పిందే చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. టీడీపీ నాయకుల ఆగడాలు వలన కొన్ని విషయాల్లో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పొన్నలూరు మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా 15 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. అయితే ఈ గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలకు, రోగులకు పొన్నలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వారు 104 వాహనం ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏదైనా ఏర్పడినప్పటికీ వైద్య సేవలను మాత్రం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల దగ్గర వాహనాన్ని నిలిపి అందిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లోని టీడీపీ నాయకులు 104 వైద్య సేవలపై కూడా పెత్తనం చాలాయిస్తున్నారు. మేము చెప్పిన దగ్గర వాహనం నిలిపి పనిచేయాలని వైద్య సిబ్బందిని బెదిరిస్తున్నారు. ఇలాంటి సంఘటనే పొన్నలూరు మండలం విప్పగుంట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గతంలో మాదిరిగానే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విప్పగుంట గ్రామంలో 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించడానికి గ్రామానికి వెళ్లారు. గ్రామం మధ్యలో ఉన్న పంచాయతీ కార్యాలయం దగ్గర వైద్య సేవలు అందించడానికి యథావిధిగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అయితే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నేను చెప్పినట్లు చేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. దీనికి ఆరోగ్య సిబ్బంది ప్రైవేట్ స్థలాల్లో కాకుండా పంచాయతీ కార్యాలయం దగ్గర అయితే ఎప్పటిలాగా ప్రజలు వస్తారని, ఇలా మరొక చోట పెట్టడం ద్వారా ఎక్కువ మంది ప్రజలు ఆరోగ్య సేవలు పొందలేరని సదరు టీడీపీ నాయకుడికి తెలిపారు. దీంతో సదరు టీడీపీ నాయకుడు ఆగ్రహించి మంత్రి బాలవీరాంజనేయస్వామి ద్వారా ఆరోగ్య సిబ్బందికి ఫోన్ చేయించి గ్రామంలో తాను చెప్పినట్లు ఆరోగ్య సిబ్బంది వ్యవహరించాలని చెప్పించినట్లు సమాచారం. దీంతో చేసేదీ లేక ఆరోగ్య సిబ్బంది పంచాయతీ కార్యాలయం దగ్గర కాకుండా టీడీపీ నాయకుడు తన పొగాకు కొష్టం దగ్గర ఏర్పాటు చేసిన స్థలంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఆరోగ్య సిబ్బందిని ప్రశ్నించిన గ్రామస్తులు....

గ్రామంలోని పంచాయతీ కార్యాలయం దగ్గర కాకుండా వ్యక్తిగతంగా మరొకరి కొష్టం దగ్గర 104 వైద్య సేవలు అందించడం ఏంటంటూ గ్రామస్తులు కొందరు ఆరోగ్య సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో రాజకీయ ఒత్తిడి వల్ల పంచాయతీ కార్యాలయం దగ్గర వైద్యసేవలు అందించలేకపోతున్నామని, తమని అర్థం చేసుకోవాలని విన్నవించారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరోసారి ఇలా జరగకుండా అందరికి అందుబాటులో ఎప్పటిలాగే పంచాయతీ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేస్తామని చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే టీడీపీ నాయకుడి ఆదేశాల మేరకు బ్యారన్ కొష్టం సమీపంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో చాలా మంది గ్రామస్తులు వైద్యసేవలు పొందకుండా వెనుదిరిగి ఇళ్లకు పోయారు. మొత్తంగా టీడీపీ నాయకుని చేష్టలతో కనీస వైద్య సదుపాయం పొందకుండా రోగులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పొగాకు కనిష్ట ధర రూ.225



టంగుటూరు వేలం కేంద్రంలో వర్షం నీరు



వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డ్ వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో బుధవారం జరిగిన వేలంలో 378 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. జమ్ముల పాలెం, తూమాడు గ్రామాలకు చెందిన రైతులు 439 బేళ్లను తీసుకురాగా 61 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.225, సరాసరి రూ.258.96గా నమోదైంది. వేలంలో 19 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

తడిసిన పొగాకు బేళ్లు

వేకువజామున కురిసిన వర్షానికి వేలానికి తీసుకువచ్చిన 20 బేళ్లు తడిసిపోయాయి. రైతులు సకాలంలో మిగిలిన బేళ్లను పక్కకు తరలించారు. లేకుంటే 100కు పైగా బేళ్లు తడిచిపోయేవని రైతులు తెలిపారు. కేంద్రంలో సౌకర్యాలు సక్రమంగా లేవని, అటు రైతుల వద్ద, కంపెనీల వద్ద సెస్ వసూలులో ఉన్న శ్రద్ధ కేంద్రంలో సౌకర్యాలను పట్టించుకోవడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో సరాసరి ధర కేజీ రూ. 268.64 అని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. అక్కచెరువుపాలెం, పైడిపాడు, గోగినేనివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 806 బేళ్లను తీసుకురాగా 727 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 79 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.230 పలికింది. వేలంలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య సందర్శించారు.

రీసర్వేకు రైతులంతా హాజరుకావాలి



గ్రామసభలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌రెడ్డి

హనుమంతునిపాడు: భూమి ఉన్న రైతులంతా రీసర్వేకు తప్పక హాజరు కావాలని డిప్యూటీ తహసీల్దార్ కె.కిషోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాళ్ళదుపురం గ్రామంలో బుధవారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి పంచాయతీలో భూముల రీ సర్వే ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికే 8 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని తెలిపారు. రీసర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూముల సరిహద్దులు నిర్ణయిస్తారన్నారు. ప్రతి రైతు రీసర్వే సమయంలో హాజరై భూములను రీసర్వే చేయించుకోవాలన్నారు. ఆర్ఐ జి. క్రిష్ణచైతన్య, మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, వీఆర్వో గురుస్వామి, గ్రామ సర్వేయర్లు లక్ష్మీనారాయణ, శ్రీనివాసుల రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చోరీల నేపథ్యంలో ముమ్మర తనిఖీలు



వాహనదారుల లైసెన్స్ ఆన్‌లైన్‌లో పరీక్షిస్తున్న సీఐ

పామూరు: వరుస చోరీల నేపథ్యంలో ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆదేశాలతో వాహనాల తనిఖీ ముమ్మరం చేసినట్లు పామూరు సీఐ భీమానాయక్ తెలిపారు. ఈసందర్భంగా బుధవారం మండల కేంద్రమైన పామూరులోని నెల్లూరురోడ్డు, కందుకూరురోడ్డుతో పాటు పలుచోట్ల వాహనాలను తనిఖీచేశారు. సీఐ మాట్లాడుతూ చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నా, కొత్తవాహనాలు తరుచూ వస్తున్నా అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వాహన చోదకులు లైసెన్స్ లేకుండా ఉన్నా, వాహనానికి లైసెన్స్ లేకపోయినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల్య వివాహాలను అరికడదాం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న కలెక్టర్ అన్సారియా

కనిగిరిరూరల్: బాల్య వివాహాలు లేని జిల్లాగా ప్రకాశం జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గర్భిణులకు నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే మన జిల్లాలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయని, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని గర్భిణులు, బాలింతలు ఆరోగ్యమైన జీవనం సాగించాలన్నారు. తొలుత గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫూర్, ఎంపీపీ ప్రకాశం, ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముల త్యాగాలు మరువలేనివి



మర్రిపూడిలో పొట్టిశ్రీరాములు, గాంధీ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం



పడమటపల్లిలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్

మర్రిపూడి: అమరవీరులు పొట్టిశ్రీరాములు, మహాత్మాగాంధీ త్యాగాలు మరువలేమని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నేరెళ్ల ఏడుకొండలు అన్నారు. పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి త్యాగమూర్తుల పోరాట ఫలితాలే నేడు మనం అనుభవిస్తున్నామన్నారు. అనంతరం పొట్టిశ్రీరాములు, గాంధీమహాత్ముని విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసులు, ఏ నరసింహారావు, ఏ హరిప్రసాదు, పి.వెంకటేశ్వర్లు, బీఎల్ఎన్‌శాస్త్రీ, బి. మాణిక్యంశాస్త్రి, ఉపాధ్యాయులు, పిచ్చెయ్య, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీపల్లి: పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేనిదని కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పీసీపల్లి మండలం పడమటిపల్లి గ్రామంలో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ ఉష, కనిగిరి బ్రాహ్మణ సంఘ నాయకులు దూళిపాళ్ల వీరభద్రరావు, ప్రజాహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరావు, సింగరాజు సాయి మనోజ్, గోన దానయ్య తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



టంగుటూరు టోల్ ప్లాజా వద్ద మాట్లాడుతున్న కార్మికులు

టంగుటూరు: టంగుటూరు టోల్ ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక టోల్ ప్లాజా వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గతంలో రెండు సార్లు రావాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, నేషనల్ హాలీడే, గ్రాట్యుటీ గురించి వినతి పత్రం ఇచ్చినా ఇతవరకు టోల్ ప్లాజా యాజమాన్యం నుంచి ఎటువంటి నిర్ణయం రాలేదని ప్రత్యక్ష పోరాటం చేస్తున్నామన్నారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, నేషనల్ హాలీడే వంటివి చేయాలని, ఫేస్, తంబ్ విషయంలో సమస్యలు తదితర వాటిని పరిష్కరించాలన్నారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ధర్నా మరిత ఉధృతం చేస్తామని టోల్ ప్లాజా యాజమాన్యాన్ని హెచ్చరించారు.

వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



చెన్నపునాయునిపల్లె వద్ద ఈదురుగాలుల వర్షానికి నేలకు వాలిన వరిపైరు

సీఎస్‌పురం(పామూరు): ఈదురుగాలులు, వర్షానికి తడిచిన, నేలకు ఒరిగిన వరి పైరును కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని రేగులచెలక, చెన్నపునాయునిపల్లి, దర్శిగుంటపేట గ్రామాల్లో మంగళవారం సాయంత్రం, రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులకు, కురిసిన మోస్తారు వర్షానికి నూవులు, వరిపైరు నేలకు ఒరగ్గా అక్కడక్కడ కోసి పొలంలో ఉంచిన వరి ఓదె కట్టలు తడిచిపోయాయి. బుధవారం ఆయా పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పొలాల్లో నీరు నిలిస్తే కాల్వల ద్వారా నీరు బయటకు పంపేలా చూసుకోవాలన్నారు. ధాన్యం తడిస్తే మొలకెత్తకుండా క్వింటా ధాన్యానికి కిలో ఉప్పు, 4 కిలోల వరిఊక కలిపి ఆరబెడితే వడ్లు మొలకెత్తుతాయన్నారు. కోసి పొలంలో ఉంచిన వరి ఓదె కట్టలు తడిసిపోతే గింజలు మొలకెత్తకుండా 50 గ్రాముల ఉప్పును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే అవి మొలకెత్తకుండా ఉంటాయని, తద్వారా పంటనష్టం ఉండదన్నారు. ఏఈఓ పి.శ్రీనివాసులు, వీఏఏలు యం.వెంకటేశ్వర్లు, చిరంజీవి, పి.వి. అనూష, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందజేత



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

కనిగిరిరూరల్: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో సెకండ్ ఇయర్‌లో రాష్ట్ర స్థాయిలో ఉన్నత ప్రతిభ చాటిన కనిగిరి విజేత జూనియర్ కాలేజీ విద్యార్థులను కలెక్టర్ తమీమ్ అన్సారియా అభినందించారు. పొట్టిశ్రీరాములు జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు బుధవారం కనిగిరి వచ్చిన కలెక్టర్‌ను మానవతా సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో 990 మార్కులు సాధించిన జి కీర్తన, బైపీసీలో 989 మార్కులు సాధించిన ఎస్‌కే నజ్మా, బైపీసీలో 988 మార్కులు సాధించిన సయ్యద్ అస్మీన్‌లకు ప్రోత్సాహక పారితోషకాలను కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. మానవతా సంస్థ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాసులు, వాగిచర్ల వెంకటేశ్వర్లు, సంస్థ ప్రతినిధులు, సభ్యులు, విజేత విద్యా సంస్థల అధినేత పసుపులేటి అరుణోదర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గయాజ్‌ను పరామర్శించిన దద్దాల



గయాజ్‌ను పరామర్శిస్తున్న దద్దాల, నేతలు

పామూరు: వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్.గయాజ్ ఇటీవల అనారోగ్యానికి గురికాగా శస్త్రచికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈసందర్భంగా బుధవారం వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ స్థానిక నాయకులతో కలిసి గయాజ్ నివాసానికి వెళ్లి పరామర్శించి ఆయన ఆరోగ్యంపై చర్చించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఏయంసీ మాజీ వైస్ చైర్మన్ షేక్.చాంద్ బాషా, యాదాల వెంకట సాయికిరణ్, కల్లూరి రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, షేక్.నాయబ్‌రసూల్, ఎస్సీసెల్ తాతపూడి రాము, జొన్నలగడ్డ గోవిందయ్య, తుపాకుల ఆంజనేయరెడ్డి, ఎంఏటీ నాయబ్‌రసూల్, ఇర్రి కృష్ణారెడ్డి, పిన్నిక రత్తయ్య, రేగులగడ్డ నాగరాజు, బద్రి, రంగారెడ్డి, పోతుల రమేష్, జి.శ్రీనివాసులురెడ్డి, మంచికంటి మధు, పబ్బతి సూరి, దర్శి సుబ్రమణ్యం, చల్లా సుబ్బారావు, బాస్కర్‌రెడ్డి, స్వర్ణ ఏడుకొండలు, ఖమ్సాప్ మహబూబ్‌బాషా, రసూల్‌ఖాన్, పాలేటి ప్రేమ్, మర్రి రాజు, కాలేషా, మితికాల బాలకృష్ణ, గురుస్వామి, తమ్మినేని శివరామిరెడ్డి, సీహెచ్.మల్లికార్జున, మద్దెల హరీష్ పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



టంగుటూరులో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

కొండపి: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తతో పెను ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక కేంద్ర అధికారి సీహెచ్ వెంకటరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం ముక్కోడిపాలెం, పోలిరెడ్డిపాలెం గ్రామాలలో ప్రజలకు పాఠశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా నివారించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఫైర్ సిబ్బంది మార్క్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చే లోగా ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు చేయాల్సిన సూచనలను ప్రజలకు అందించారు. ఫైర్ సిబ్బంది, సీఆర్పీ నరసింహారావు, గ్రామ ప్రజలు,విద్యార్థులు పాల్గొన్నారు.

టంగుటూరు: అగ్ని ప్రమాదాలు సంభవించిన వెంటనే సమాచారం ఇవ్వాలని అగ్నిమాపక శాఖాధికారి రమణారెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పలుకాలనీల్లో ప్రదర్శనలు నిర్వహించారు. నిప్పుతో చెలగాటమాట వద్దని సూచించారు.

కనిగిరిరూరల్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి సీహెచ్ బంగారుబాబు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎంజీఆర్, వెన్నల, తదితర అపార్ట్‌మెంట్ల వద్ద నివాసితులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, ఎలక్ట్రిక్ ఫైర్, గ్యాస్ ఫైర్ ఇలా ఎలాంటి ప్రమాదాలు తలెత్తినప్పుడు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్ణయాలపై అవగాహన కల్పించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



కొండపిలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ విక్టోరియా రాణి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

కొండపి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విక్టోరియా రాణి అన్నారు. పోషణ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు వసంతరావు, హజరత్తయ్య, సర్పంచ్ మాచర్ల, గర్భిణులు పాల్గొన్నారు.

పామూరు: గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా శిశువు ఆరోగ్యంగా జన్మిస్తారని తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీఓ ఎల్ బ్రహ్మయ్య అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ ఆధ్వర్యంలో బుధవారం పోషణ పక్వాడా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గర్భిణులు, రక్తహీనతను నివారించేందుకు వైద్య శాఖ ఇచ్చే విటమిన్ మాత్రలు ఉపయోగించాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎన్‌జీఓ షేక్.నాయబ్‌రసూల్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఓ.సుబ్బమ్మ, సీసీ సరళ, పీఎస్ రామ్మోహన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నలూరు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు చేసి సాంప్రదాయ వస్తువులు అందజేశారు.